

నూతన సందడి

● నిమ్మాడలో ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు



కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు

కోటబొమ్మాళి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతన సందడి నెలకొంది. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో మంగళవారం కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిసేందుకు జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు, అభిమానులు, నాయకులు పెద్దఎత్తున నిమ్మాడకు తరలివచ్చారు. శాసన సభ్యులు గొండు శంకర్, గౌతు శిరీష్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి తదితరులు మంత్రులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాబాయ్, అబ్బాయ్ కలిసి కేక్ కట్ చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు పిలుపు మేరకు కార్యకర్తలు బొకేలు, శాలువాల స్థానంలో నోటు పుస్తకాలు, పెన్నులను కొనుగోలు చేసి పేద పిల్లలకు అందించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు గట్టిబందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, రిటైర్డ్ ఎస్పీ కింజరాపు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.5.46కోట్ల మద్యం తాగేశారు!



● రూ.99 బ్రాండ్‌తో మరింతగా పెరిగిన విక్రయాలు

● 2,621 కేసుల బీర్లు ఉఫ్

● గతం కంటే కొనుగోలు పెరిగినా తగ్గిన ఆదాయం

శ్రీకాకుళం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో మద్యం ఏరులై పారింది. మంగళవారం ఒక్కరోజే రూ.5.46 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమైన విక్రయాలు అర్ధరాత్రి వరకూ సాగాయి. మద్యం దుకాణాలు, బార్లకు అర్ధరాత్రి వరకూ ప్రత్యేక అనుమతి ఇవ్వడంతో లిక్కరు, బీర్లు రికార్డు స్థాయిలో అమ్ముడయ్యాయి. అయితే గతేడాదితో పోల్చితే ఈ దఫా ఆదాయం కాస్త తగ్గింది.

6,984 కేసుల విక్రయం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం 6,984 కేసుల ఐఎంఎల్(వైన్) విక్రయం జరిగింది. 2,621 కేసుల బీర్లు అమ్ముడుపోయాయి. గతేడాది డిసెంబరు 31 (2023)తో పోల్చితే విక్రయాలు భారీగా పెరిగినా ఆదాయం మాత్రం తగ్గింది. గతేడాది జిల్లాలో 5,597 కేసుల ఐఎంఎల్ మద్యం, 2,329 కేసుల బీర్లు విక్రయం జరిగింది. వాటి ద్వారా రూ.5,12,21,367 ఆదాయం సమకూరింది. విక్రయించిన మద్యం కేసులు తక్కువే అయినప్పటికీ ధర ఎక్కువ కారణంగా అంతటి ఆదాయం వచ్చింది. అయితే, ఈ దఫా విక్రయాలు పెరిగినా ధర తక్కువ కారణంగా ఆదాయం తగ్గుముఖం పట్టింది. జగన్ సర్కారు కాలంలో చిత్రవిచిత్రమైన బ్రాండ్లపేరుతో మద్యం విక్రయించిన విషయం తెలిసిందే. మద్యం నాణ్యత తక్కువ ధర ఎక్కువగా ఉండేది. అప్పట్లో కనిష్టంగా చీఫ్ లిక్కర్ రూ.130 పైబడే ఉండేది. అందువల్ల విక్రయాలు తక్కువగా ఉన్నా ఆదాయం ఎక్కువగా ఉండేది. అయితే ఎన్నికల హామీల్లో 'నాణ్యమైన మద్యం అందుబాటులో ఉంచడమే కాకుండా.. ధరలను కూడా నియంత్రిస్తామని' మాట ఇచ్చారు చంద్రబాబు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. కొత్త మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు దుకాణాలను ఏర్పాటు చేశారు. రూ.99కే క్వార్టర్ మద్యం తీసుకువచ్చారు. దీంతో అమాంతం గిరాకీ పెరిగింది. కొత్తసంవత్సరం వేళ రూ.99కే క్వార్టర్ లభ్యం కావడంతో మందుబాబులు తెగ సంబరపడిపోయి.. డబుల్.. త్రిపుల్‌గా తీసేసుకుని తెగ తాగారు. ధర తగ్గడంతో 2023 డిసెంబరు 31తో పోల్చితే ఈదఫా రూ.11,75,103 ఆదాయం తగ్గింది.

ఇక్కడో కోనేరుండేది!

● నాలుగు వైపులా మట్టితో కప్పేస్తున్న వైనం

● పైడిభీమవరంలో రూ.కోట్ల స్థలం ఆక్రమణ

● స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారుల మౌనం

అది పారిశ్రామికవాడ.. జాతీయ రహదారి చెంతనే ఉంది. అక్కడ సెంటు రూ.లక్షల్లో పలుకుంది. ఇంకేముంది అక్రమార్కుల కన్ను ఓ కోనేరుపై పడింది. అక్కడ భూగర్భ జలాలకు ఇదే పెద్దదిక్కు అయినా వారికి ఇదేమీ పట్టలేదు. మట్టిని కొంచెం కొంచెం కోనేరు గర్భంలో వేశరు. చివరకు రూ.కోట్ల స్థలం కబ్జా చేసేశారు. ఇప్పుడు అక్కడ కోనేరు ఆనవాళ్లే లేకుండా చేశారు.



పైడిభీమవరం సుద్ద కోనేరును తొలుత మట్టితో కప్పిన దృశ్యం



తరువాత చదును చేసిన దృశ్యం

రణస్థలం, జనవరి 1(ఆంధ్రజ్యోతి):

నాలుగు దశాబ్దాల కిందట పైడిభీమవరంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేశారు. పరిశ్రమల ఏర్పాటుతో తమ బతుకులు మారిపోతాయని స్థానికులు భావించారు. కానీ నీరు, జలం, వాయువు అన్నీ కలుషితం అయ్యాయి. దీనికితోడు సహజ వనరుల దోపిడీ ప్రారంభమైంది. పరిశ్రమల వ్యర్థాలతో కందివలస గెడ్డ పూర్తిగా కలుషితమైంది. ఇప్పుడు గ్రామస్థులు సాగు, ఇతరత్రా అవసరాలు తీర్చే సుద్ద కోనేరు పూర్తిగా ఆక్రమణల చెరలో చిక్కింది. 2 ఎకరాల 36 సెంట్ల విస్తీర్ణం కలిగిన ఈ కోనేరు చిన్నపాటి కాలువగా మిగిలింది. సుమారు రూ.40 కోట్ల విలువ చేసే భూమి అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతోంది.

భూగర్భ జలాలకు దిక్కు..

జాతీయ రహదారి పక్కనే పైడిభీమవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 103లో 12లో సుద్ద కోనేరు ఉంది. దీని విస్తీర్ణం 2.36 ఎకరాలు. పారిశ్రామికవాడ ఏర్పాటుచేయక ముందు దీన్ని సాగు, తాగు నీటి అవసరాలకు వినియోగించేవారు. చుట్టుపక్కల పరిశ్రమలు, భారీ నిర్మాణాలు ఏర్పాటు చేయడంతో సాగు నిలిచి పోయింది. అయితే పైడిభీమవరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఈ కోనేరు ఎంతగానో దోహదపడేది. పక్కనే ఉన్న కందివలస గెడ్డ.. వ్యర్థాలతో నిండి భూగర్భ జలాలు కలుషితం కావడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ఈ కోనేరులో నీటి నిల్వలతో చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా లభించేవి. అలాంటి కోనేరు ఇప్పుడు పూర్తిగా కబ్జాకు గురైంది.

సెంటు ధర రూ.20 లక్షలకుపైగా..

ఇక్కడ సెంటు భూమి రూ.20 లక్షలపైమాటే. పైగా జాతీయ రహదారి చెంతనే ఉండడంతో ఈ భూమికి భలే గిరాకీ. అందుకే అక్రమార్కులు సుదూర ప్రాంతాల నుంచి మట్టిని తెచ్చి కోనేరు గర్భంలో పోస్తున్నారు. క్రమేపీ నాలుగు వైపులా చదును చేశారు. ఇలా పరాధీనంలోకి వెళ్లిన భూమి విలువ రూ.40 కోట్లుగా తెలుస్తోంది. అయితే దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వెలుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. అక్రమార్కులకు రాజకీయ నేతలు, ఉన్నతాధికారుల అండ ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరముంది.

దారుణం..

గతంలో ఈ కోనేరు సాగు, తాగు నీటి అవసరాలను తీర్చేది. దాన్ని మట్టితో కప్పేస్తున్నారు. స్వాధీనం చేసుకుంటున్నారు. పైడిభీమవరంలో పూర్తిగా భూగర్భ జలాలు అడుగంటాయి. కోనేరు కొంతవరకూ జలాలను కాపాడుతోంది. దాన్ని కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోక పోవడం దారుణం.

-స్థానికుడు, పైడిభీమవరం

మా పరిస్థితి దయనీయం..

గ్రామం చెంతనే ఉన్న కందివలస గెడ్డ పూర్తిగా కలుషితం అయింది. వ్యర్థాలతో నిండిపోయి సాగు, తాగునీటి అవసరాలు తీరకుండా పోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఒక్క ఆధారంగా ఉన్న కోనేరు సైతం కబ్జాకు గురికావడం బాధగా ఉంది. ఇంత జరుగుతున్నా అధికారులెవరూ చర్యలకు ముందుకు రాలేదు.

-స్థానికుడు, పైడిభీమవరం

విచారణ చేయిస్తాం..

పైడిభీమవరం కోనేరు ఆక్రమణలపై ప్రత్యేకంగా దృష్టిపెడతాం. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. సిబ్బందిని పంపి పరిశీలన చేయాలని ఆదేశించాం. ఆక్రమణలకు గురైతే బాధ్యులకు నోటీసులిస్తాం. ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటుచేస్తాం.

-ఎన్.ప్రసాద్, తహసీల్దారు, రణస్థలం

కోడళ్లపై కత్తితో దాడి

● ముగ్గురికి గాయాలు ● ఆస్తి తగాదాలే కారణం ● నడిమివలసలో ఓ మామ ఘాతుకం



గాయపడిన లక్ష్మి, వసంత, సావిత్రమ్మ

జి.సిగడాం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కోడళ్లపై మామ కత్తితో దాడి చేసిన ఘటన మండలంలోని నడిమివలస గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఆస్తి తగాదా కారణంగా మామ కోడళ్ల మధ్య గొడవ చిలికిచిలికి గాలివానలా మారి దాడికి దారి తీసింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. నడిమివలసకు చెందిన పిన్నింటి సత్యనారాయణకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ముగ్గురికి ఆస్తి పంపకాలు జరిగాయి. అయితే, తండ్రి వద్దనే కుమార్తె ఉంటుంది. ఈ నేపథ్యంలో సత్యనారాయణ ఓ పొలాన్ని తన కుమార్తెకు దాఖలు చేశాడు. దీనిపై కోడళ్లు లక్ష్మి, వసంత అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కారణంగా వారి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ పొలంలో పెసర పంట తీసేందుకు బుధవారం ఉదయం లక్ష్మి, వసంత వెళ్లారు. వీరిని సత్యనారాయణ, ఆయన కుమార్తె అడ్డుకున్నారు. ఈ పొలం తన కుమార్తెకు ఇచ్చేశానని, దానిపై మీకు ఎటువంటి హక్కు లేవని సత్యనారాయణ వాదించాడు. అంతటితో ఆగకుండా వారి కంట్లో కారం చల్లి కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో వసంత, లక్ష్మి తలపై తీవ్రగాయాలయ్యాయి. వీరిని విడిపించేందుకు పక్క పొలంలో ఉన్న తమ బంధువు సావిత్రమ్మ వెళ్లగా ఆమెకు కూడా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబీకులు, గ్రామస్థులు పొలం వద్దకు వెళ్లి క్షతగాత్రులను రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వై.మధుసూదనరావు తెలిపారు.



దాడికి ఉపయోగించిన కత్తి

పీఏసీఎస్ ఎన్నికలకు

● పర్సన్ ఇన్‌చార్జిలను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

● త్రీమెన్ కమిటీలను నియమించాలనే యోచన ● జూన్‌లో పూర్తిస్థాయి ఎన్నికలు?

మరో ఆరు నెలలు ఆగాల్సిందే

ఇచ్ఛాపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిలను కొనసాగిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. మరో ఆరు నెలల పాటు వారు కొనసాగాలని చెప్పింది. అలాగే, త్రీమెన్ కమిటీలను నియమించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. దీంతో పీఏసీఎస్ ఎన్నికలకు మరో ఆరు నెలలు ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులకు సేవలు అందించడంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు) కీలక పాత్ర పోషిస్తాయి. రైతులకు పంట రుణాలు మంజూరు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు ఇవ్వడంతో పాటు ఇతర సేవలు అందిస్తుంటాయి. కానీ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పీఏసీఎస్‌లు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయి. రైతులకు సేవలందించాల్సింది పోయి వ్యాపార ధోరణిలోకి మారాయి. అయితే, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పీఏసీఎస్‌లకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తోంది. త్రీమెన్ కమిటీ సభ్యులను నియమించడంతో పాటు జూన్‌లోగా ఎన్నికలు పూర్తిచేయాలని నిర్ణయించింది. నీటి సంఘాల మాదిరిగానే ఎన్నికలు పూర్తిచేయా లన్న సంకల్పంతో ఉంది. అలాగే, పూర్తి డిజిటలైజేషన్ చేసి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను రైతుసేవల్లోకి మార్చాలని చూస్తోంది.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో 42 పీఏసీఎస్‌లు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో సహకార బ్యాంక్ ఉంది. అలాగే, 25 బ్రాంచ్‌లు కొనసాగుతున్నాయి. మరో 11 ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే జిల్లా నుంచి పాలకొండ, రాజాం నియోజకవర్గాలు వేరుపడ్డాయి. కానీ, ఇంతవరకూ వాటి విభజన జరగలేదు. గత ఏడేళ్లుగా పీఏసీఎస్ కార్యవర్గాలకు ఎన్నిక జరగలేదు. చివరిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో 2013లో ఎన్నికలు జరిగాయి. 2018తో వీరి పదవీకాలం ముగిసింది. కానీ, అప్పటికే సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో నాడు చంద్రబాబు సర్కారు పాత కార్యవర్గాలనే కొనసాగించింది. కానీ, 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మాత్రం త్రిసభ్య కమిటీతో తన పార్టీ ప్రతినిధులను నామినేట్ చేసింది. అప్పటి నుంచి ఈ ఐదేళ్ల కాలం సొంత పార్టీ నేతలను నామినేట్ చేసి కాలం వెళ్లదీసింది. కనీసం ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచన కూడా చేయలేదు. దీంతో రైతులకు సహకార సేవలు అందని (మిగతా 8వ పేజీలో)



ఇచ్ఛాపురం పీఏసీఎస్ కార్యాలయం

పొరపాట్లకు తావివ్వొద్దు

● ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

● రథసప్తమి ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన 7లో





నరసన్నపేట మార్కెట్ కమిటీ కార్యాలయం

ఏఎంసీ చైర్మన్ల రిజర్వేషన్లకు కసరత్తు

● జిల్లాలో 12 మార్కెట్ కమిటీలు ● ఎమ్మెల్యేల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

నరసన్నపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీల చైర్మన్ల నియామకానికి సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీంతో ఇప్పటి నుంచే ఆశావహులు ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో శ్రీకాకుళం, నరసన్నపేట, కోటబొమ్మాళి, ఆమదాలవలస, పొందూరు, జలుమూరు, ఇచ్ఛాపురం, కంచిలి, పలాస, ఎచ్చెర్ల, పాతపట్నం, హిరమండలం మార్కెట్ కమిటీలు (మిగతా 8వ పేజీలో)

అష్టదిగ్బంధంలో.. పెద్దమార్కెట్



పెద్దమార్కెట్‌లో రోడ్డుపైనే వ్యాపారాలు

మార్కెట్‌లోకి వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సిందే..



- రోడ్లపైనే వ్యాపారం
- దుకాణాల ముందే తోపుడు బండ్లు
- లోపలకు వెళ్తే బయటకు రావడం కష్టమే
- కొనుగోలుదారులకు తప్పని అవస్థలు

శ్రీకాకుళం అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని పొట్టిశ్రీరాములు మార్కెట్ (పెద్ద మార్కెట్) జిల్లాలోనే అతిపెద్దది. రెండు దశాబ్దాల కిందట ఏర్పాటైన ఈ మార్కెట్‌కు నగరవాసులతో చుట్టు పక్కల 20 గ్రామాలకు చెందిన వేలాది మంది ప్రజలు కాయగూరలు, నిత్యవసర సరుకులు కొనుగోలు చేసేందుకు వస్తుంటారు. ప్రతి రోజూ లక్షలాది రూపాయల వ్యాపారం జరుగుతుంది. అయితే, రోడ్లపైనే వ్యాపారాలు, దుకాణాల ముందే తోపుడు బండ్లు, అక్కడే వాహనాల పార్కింగ్‌తో ఆ మార్కెట్‌ను అష్టదిగ్బంధనం చేస్తున్నారు. కనీసం నడిచే మార్గం కూడా ఉండడం లేదు. దీంతో లోపలకు వెళ్లేవారు బయటకు వచ్చేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అయినా నగరపాలక అధికారులకు పట్టడం లేదు.

దుకాణాలు వదిలేసి రోడ్లపై వ్యాపారాలు

నగరపాలక సంస్థ అధికారులు రూ.కోట్ల వ్యయంతో మార్కెట్‌లో 340కి పైగా దుకాణాలు నిర్మించి వ్యాపారులకు ఇచ్చారు. అయితే వ్యాపారులు మాత్రం దుకాణాల్లో కాకుండా రోడ్లపై వ్యాపారం చేస్తున్నారు. రోడ్లపై నడిచేందుకు కూడా దారి లేకుండా చేస్తున్నారు. పెద్ద మార్కెట్‌లోకి వెళ్లాలంటే ఆరు మార్గాలు ఉన్నాయి. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ నుంచి, టౌన్‌హాల్ ఎదురుగా ఉన్న మార్గం, చేపల మార్కెట్ మీదుగా, పందుపుళ్ల జంక్షన్ గుండా, ఉల్లిపాయల హోల్‌సేల్ దుకాణం మీదుగా, చికెన్ సెంటర్ల ఎదురుగా ఉన్న మార్గం ద్వారా పెద్దమార్కెట్‌లోకి ప్రవేశించవచ్చు. అయితే ఈ ఆరు మార్గాలనూ దుకాణదారులు బ్లాక్ చేస్తున్నారు. బయట బండ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనికితోడు తోపుడు బండ్లను సైతం రోడ్లకు ఇరువైపులా నిలిపేసి కాయగూరలు, పండ్లు విక్రయిస్తున్నారు. దీంతో మార్కెట్‌లోకి వెళ్లి.. వచ్చేందుకు దారి లేక కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. మరోపక్క పెద్ద మార్కెట్‌లో సెంటర్ పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే, మార్కెట్‌కు వచ్చేవారంతా తమ వాహనాలను ఎక్కడిబడితే అక్కడే నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది.



ఆక్రమణలో పెద్దమార్కెట్‌కి వెళ్లే రహదారి

తోపుడు బండ్లకు సప‘రేటు’

పెద్దమార్కెట్‌లో దుకాణాల ముందు ఎవరైనా తోపుడు బండ్లు పెట్టుకోవాలంటే సంబంధిత దుకాణాదారులకు కొంత ముట్టజెప్పాల్సిందే. తోపుడు బండి నిలిపేందుకు రోజుకి రూ.100 నుంచి రూ.200, రాత్రి పూట విద్యుత్ దీపం పెట్టుకునేందుకు మరో రూ.50 చెల్లిస్తున్నట్లు తోపుడు బండ్ల వ్యాపారులు వాపోతున్నారు. అందువల్లే తమ దుకాణాల ముందు తోపుడు బండ్లు ఉన్నా దుకాణదారులు అడ్డుచెప్పడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు, పోలీసులు

పెద్దమార్కెట్‌లో రద్దీ కారణంగా నిరంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంటుంది. దీనిపై ఎప్పుడైనా ఉన్నతాధికారులు చర్చించినప్పుడు, లేదా ఆ ప్రాంతంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు తప్ప పోలీసులు మార్కెట్ వైపు దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. నగరపాలక సంస్థ అధికారులు సైతం తమకు పట్టనట్టే వ్యవహరిస్తున్నారు. మార్కెట్ అభివృద్ధికి కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఇక్కడి సమస్యలను పట్టించుకోవడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై వ్యాపారాలు చేస్తున్నా చోద్యం చూస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా స్పందించాలని నగరవాసులు కోరుతున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులైనవారికి దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా నిర్వహిస్తున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. అభ్యర్థులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బుధవారం ఓ ప్రకటనను ఎస్పీ విడుదల చేశారు. రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు వారిచే నిర్వహిస్తున్న పోలీసు కానిస్టేబుల్ నియామకాల్లో జిల్లాలో 7,390 మంది అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వీరిలో 6,215 మంది పురుషులు, 1,175 మంది మహిళలు ఉన్నారన్నారు. అయితే గడిచిన రెండు రోజుల్లో 1,139 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, మొదటి రోజు 322 మంది, రెండో రోజు 409 మందితో కలిపి మొత్తం 731 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో సోమవారం 192 మంది, మంగళవారం 205 మంది కలిపి మొత్తం 397 మంది అభ్యర్థులకు ఛాతి, ఎత్తు, లాంగ్ జంప్, 1600, 100 మీటర్ల పరుగులో అర్హత సాధించారని ఎస్పీ వివరించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఫిజికల్ మెజర్‌మెంట్ (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియన్సీ (పీఈటీ) పరీక్షలు నిర్వహించడమే కాకుండా మైదానంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిష్పక్షపాతంగా ఎంపికలు చేస్తున్నట్టు చెప్పారు. ఎచ్చెర్లలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు మైదానంలో ఈ నెల 18 వరకు ఎంపికలు కొనసాగుతాయన్నారు. అభ్యర్థులు దళారులు, మధ్యవర్తులను నమ్మవద్దని ఎస్పీ సూచించారు. అటువంటి వారెవరైన ఎదురైతే సమాచారాన్ని సంబంధిత పోలీసు అధికారులకు, లేదా 63099 90800, 63099 90911 ఫోన్ నెంబర్లలో తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ స్పష్టం చేశారు. అభ్యర్థులు కాల్ లెటర్‌లో తెలిపిన నిర్ధేశించిన తేదీ, సమయానికి ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఒక సెట్ జెరాక్స్ కాపీతో హాజరుకావాలన్నారు.

కార్మికుల పిల్లలకు స్టేషనరీ కిట్లు

శ్రీకాకుళం అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పిల్లలకు నూతన సంవత్సరం సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో పెన్నులు, పుస్తకాలు, పెన్సిల్‌లు పంపిణీ చేశారు. ఈ మేరకు బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో చిన్నారులకు కమిషనర్ పీవీవీ ప్రసాదరావు చేతుల మీదుగా స్టేషనరీ కిట్లను అందజేశారు. అనంతరం కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ.. ఏఐటీయూసీ పోరాటాలే కాకుండా ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కల్యాణి అప్పలరాజు మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే గొండు శంకర్ అందిస్తున్న సేవలే స్ఫూర్తిగా తమ యూనియన్ హక్కులు, బాధ్యతలు రెండు కళ్ళుగా భావించి ఈ సేవా కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ సురేంద్రకుమార్, యూనియన్ అధ్యక్షుడు కె.వేణుగోపాల్, ప్రతినిధులు గురుమూర్తి, రామారావు, రమణ, రామచంద్ర, గోపి, గణేష్, సీతమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

‘చౌదరి’ని అభినందించిన ముఖ్యమంత్రి



పురుషోత్తమనాయుడిని సన్మానిస్తున్న చంద్రబాబు

అరసవల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో, గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ జనరల్ సెక్రటరీ, జిల్లాకు చెందిన చౌదరి పురుషోత్తమనాయుడు పదవీ విరమణ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, జనరల్ సెక్రటరీ ఎ.విద్యాసాగర్, అల్లెన రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మిమిక్రీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రశాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు, దుప్పట్లు, తువ్వాళ్లు, మిఠాయిలు పంచి పెట్టారు. రాజు, బలిజేపల్లి రవి, తమ్మా కామేశ్వరరావు, పి.శివప్రసాద్, బలిజేపల్లి వెంక సీతారామ శాస్త్రి, అవధానుల శంకర్, జమ్మి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

- ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- రథసప్తమి ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలన



రథసప్తమి ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు

అరసవల్లి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుకలు రాష్ట్ర పండగగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఏర్పాట్లలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా, కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం రథసప్తమి ఏర్పాట్లపై ఎమ్మెల్యే గొండు శంకర్, ఎస్పీ కె.మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి క్షేత్రస్థాయిలో ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చే నెల 2, 3, 4వ తేదీల్లో జరిగే మూడు రోజుల వేడుకల సందర్భంగా అరసవల్లికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లను ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎస్పీ వివేకానంద, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఇతర అధికారులతో ఏర్పాట్లకు సంబంధించి చర్చించారు. క్యూలైన్ల ఏర్పాటు, తాగునీరు, శానిటేషన్, ప్రసాదాల పంపిణీ, ప్రవేశ మార్గాలు, పార్కింగ్, తదితర విషయాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. డీఎస్పీ వివేకానంద మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో భక్తులు వచ్చేందుకు ప్రత్యేకంగా డమ్మీ క్యూలైన్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. భద్రతా ఏర్పాట్లపై కూలంకషంగా చర్చించారు. కేశఖండన శాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, మున్సిపల్ స్కూల్ వద్ద తాత్కాలిక ఏర్పాటు చేస్తున్నట్లు, అలాగే స్కూల్‌కు ఆనుకుని ఉన్న రెండున్నర ఎకరాల మున్సిపల్ స్థలంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్టు ఈవో వివరించారు. దేవాలయంలో భక్తులు దర్శనానికి వచ్చి పోయే క్యూలైన్ల మార్గాలను, ప్రసాదాల కౌంటర్లను, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇంద్రపుష్కరిణి వద్ద గల వైజయంతి కళావేదికను, ఆలయ పరిసర ప్రాంతాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీవోలు సాయి ప్రత్యూష, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, ఇంజినీర్ పొగిరి సుగుణాకరరావు, జిల్లా టూరిజం అధికారి కె.నారాయణరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకలపై నేడు అభిప్రాయ సేకరణ

శ్రీకాకుళం కలెక్టరేట్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుకలు మరింత ఘనంగా నిర్వహించేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలను స్వీకరిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ మేరకు జడ్పీ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి ప్రజలు తమ సలహాలు, సూచనలు తెలియజేయాలని కోరారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో రథసప్తమి వేడుకలు జరుగనున్న నేపథ్యంలో విలువైన సలహాలు, సూచనలతో పండుగను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు.



టెక్కలి: బీసీ బాలికల గురుకులంలో విద్యార్థినుల సందడి



కవిటి: పుక్కళ్లపాలెం వద్ద బీచ్‌లో సందర్శకులు

‘నూతన’ ఉత్సాహం

కవిటి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా కవిటి సాగర తీరం సందర్శకులతో కిటకిటలాడింది. బుధవారం కుటుంబాల సమేతంగా కవిటి తీరంలో సరదాగా గడిపారు. పుక్కళ్లపాలెం తీరం వద్ద సరుగుడు చెట్ల మధ్య సహపంక్తి భోజనాలు చేశారు. ఆ తర్వాత సముద్రంలో కేరింతలు కొడుతూ సందడి చేశారు. బీచ్ వరకు కొత్తగా రోడ్డు సౌకర్యం కల్పించడంతో వాహనాల రద్దీ పెరిగింది. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. మెరైన్, కవిటి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

పాతపట్నం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా స్థానిక జేసీపీఈఎండ్ఈఎం, పాతపట్నం, రొంపివలస, ఆర్ఎల్‌పురంలలో ఆర్సీఎం చర్చిల్లో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యువతులు డ్యాన్స్‌లతో అలరించారు. జేసీపీఈఎండ్ఈఎం చర్చిలో డి.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో పాస్టర్ జి.ప్రసాద్ సారథ్యంలో వాచ్‌నైట్ సర్వీస్‌లు, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఎంజేపీ బీసీ గురుకులంలో..

టెక్కలి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులంలో బుధ వారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ఆట పాటలతో సందడిచేసి మిఠాయిలు తినిపించుకుని న్యూ ఇయర్ విషెస్‌ను చెప్పి ఆనందం పొందారు.

సందడిగా..

సోంపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంస్కారభారతి విద్యా సంస్థల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో యాజమాన్యం నిమ్మన దాసు, వై.దేవరాజు, బి.శ్రీనుబాబు పాల్గొన్నారు.



పాతపట్నం: చర్చిలో డ్యాన్స్‌లు చేస్తున్న యువతులు



సోంపేట: నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పరిశోధనాత్మక విద్యతో గుర్తింపు



వీసీని సత్కరిస్తున్న రిజిస్ట్రార్, తదితరులు

ఎచ్చెర్ల, జనవరి 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో పరిశోధనాత్మక విద్యకు ప్రాధాన్యతతో మరింత గుర్తింపు ఇవ్వనున్నట్టు వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఆమె బోధనా, బోధనేతర సిబ్బందితో మాట్లాడారు. వర్సిటీలో స్నాతకోత్సవం నిర్వహణకు గవర్నర్ కార్యాలయం నుంచి కొద్ది రోజుల్లో అనుమతి వస్తుందన్నారు. వర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రూ.35 కోట్లతో నిర్మించిన పరిపాలనా భవనం త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కల్పతరువు దినోత్సవం

సరుబుజ్జిలి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రొట్టవలసలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఘనంగా కల్పతరువు దినోత్సవాన్ని నిర్వహించారు. ఏటా జనవరి ఒకో తేదీన ఈ దినోత్సవంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. శ్రీశారదా రామకృష్ణసేవా సమితి ఆధ్వర్యంలో రొట్టవలస భజన బృందాలు, గీతా పారాయణ బృందం, నగర సంకీర్తన బృందం కలిసి విశేష సంకీర్తనలు చేపట్టాయి. ఆలయ అర్చకులు మావుడూరు సు బ్రహ్మణ్యశర్మ, సమితి అధ్యక్షులు మందపల్లి రామకృష్ణారావు, పాండ్రంకి నారాయణరావు, మూడడ్ల రమణమూర్తి, సీతయ్యగారి గోవిందరావు, రమణయ్య, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

మేలుకొలుపుతో ఆధ్యాత్మిక శోభ



మేలుకొలుపులో పాల్గొన్న భక్తులు

సరుబుజ్జిలి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ప్రారంభం నుంచి 30 రోజులు గ్రామాల్లో నిర్వహించే మేలుకొలుపులు నగర సంకీర్తనతో ఆధ్యాత్మిక శోభ అలుముకుంది. జై శ్రీమనారాయణ ఆండాలమ్మ గోదాదేవి పూజించే భక్త బృందం ఉదయం నాలుగు గంటలకు ఈ మేలుకొలుపు నగర సంకీర్తన ప్రారంభించి.. వివిధ గ్రామాల్లో భక్తి పాటలు పాడుకుంటూ వెళ్తుంటారు. బుధవారం సరుబుజ్జిలి గ్రామానికి చెందిన మేలుకొలుపుల భక్త బృందం నందికొండలో నగర సంకీర్తన చేపట్టారు.

కొత్త సంవత్సరం వేడుక

- న్యూ ఇయర్ విషెస్ తెలిపేందుకు వచ్చిన క్యాడర్
- ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద అధికారుల కోలాహలం
- పుస్తకాలు, పెన్నులు ఇస్తూ అభినందన

నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా బుధవారం జిల్లాలో పలువురు ప్రజాప్రతినిధుల ఇళ్లు, కార్యాలయాల వద్ద అధికారులు, పార్టీల క్యాడర్ కోలాహలం కనిపించింది. గతానికి భిన్నంగా కొందరు ఎమ్మెల్యేలు బొకేలు, కేక్‌లకు బదులు పిల్లలను అందించేందుకు పుస్తకాలు, పెన్నులను స్వీకరించారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు, అధికారులు తరలివచ్చారు.

-ఆంధ్రజ్యోతి బృందం


అరసవల్లి: టీడీపీ జిల్లా కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే గొండు శంకర్


రణస్థలం: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నేతలు



కవిటి: రామయ్యపుట్టుగలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్


రణస్థలం: నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు


పొందూరు: ఆమదాలవలసలో ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో టీడీపీ నాయకులు


నరసన్నపేట/పోలాకి: ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న వెలుగు సిబ్బంది


పలాస: ఎమ్మెల్యే శిరీషకు శుభాకాంక్షలు చెబుతున్న ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు తదితరులు


పాతపట్నం: ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీసు అధికారులు, సిబ్బంది


కొత్తూరు: మాతలలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణకు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు


హిరమండలం: జడ్పీటీసీ బుచ్చిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు


ఎచ్చెర్ల: ఎస్ఎంపురంలో జడ్పీ మాజీ అధ్యక్షురాలు చౌదరి ధనలక్ష్మి, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి బాబ్జీలకు శుభాకాంక్షలు చెప్తున్న క్యాడర్

క్రైం కార్నర్

బాణసంచా పేలి.. వ్యక్తికి గాయాలు

సోంపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బాణసంచా పేలి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా బుధవారం పట్టణంలోని కొత్తపేటకు చెందిన ఉమా బెహరా బాణసంచా కాల్చారు. ఈ క్రమంలో తన ఎడమ చేతిలోనే ఓ టపాసు పేలిపోయింది. దీంతో చేతికి తీవ్రంగా గాయాలయ్యాయి. విపరీతంగా రక్తస్రావం కావడంతో స్థానికంగా ప్రథమ చికిత్స తీసుకుని, మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు.

సింహం విగ్రహం ధ్వంసం

- కనిమెట్ట శివాలయం వద్ద ఘటన


ఆలయం ముందు ధ్వంసమైన సింహం విగ్రహం

పొందూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కనిమెట్ట శివాలయం ముందున్న సింహం విగ్రహాల్లో ఒక దాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనపై గ్రామస్థులు, అర్చకుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బుధవారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి ఆలయం ముందు ఉన్న సింహాల విగ్రహాల్లో ఒకటి ధ్వంసమవ్వడాన్ని గుర్తించారు. ఈవిషయాన్ని గ్రామ పెద్దలకు చెప్పారు. దీంతో అక్కడికి చేరుకున్న గ్రామ పెద్దలు ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించారు. కాగా అత్యంత పురాతన ఆలయాల్లో కనిమెట్ట శివాలయం ఒకటి. ఈ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఈ ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకుంటారు. పురాతన ఆలయంలో విగ్రహాల ధ్వంసంతో భక్తుల మనోభావాలు దెబ్బ తిన్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

శంఖారావం సభకు తరలిరండి


దేవుపురంలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

నందిగాం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 5న విజయవాడలో నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం పలు గ్రామాల్లో పర్యటించి శంఖారావం సదస్సుపై కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారంచేశారు. కార్యక్రమంలో బీజేపీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జన్ని పరమేశ్వరరావు, సోషల్‌మీడియా ప్రతినిధి హేమరాజు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు

పలాస, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో అభిమానులు, కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే గౌతు శిరీషకు ఇచ్చిన పుస్తకాలు, పెన్నులు, ఇతర సామగ్రిని పేద విద్యార్థులకు అందిస్తామని పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి తెలిపారు. ఈ మేరకు బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పిలుపు మేరకు బొకేల ఖర్చుతో పుస్తకాలు, పెన్నులు అందించి నూతన విధానానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. త్వరలో విద్యార్థులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గాలి కృష్ణా రావు, ఎం. నరేంద్ర, టంకాల రవిశంకర్ గుప్తా, సప్ప నవీన్, జోగ మల్లి పాల్గొన్నారు.

రాష్ట్ర టెన్నీకాయిట్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక


రాష్ట్ర టెన్నీకాయిట్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్టుతో నిర్వాహకులు

పలాస, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పలాసలో ఈనెల 11, 12వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర టెన్నీకాయిట్ పోటీలకు జిల్లా జట్టును బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఎంపిక చేశారు. సంఘం కోశాధికారి పి.తవిటయ్య ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో న్యాయ నిర్ణేతలుగా పీఈటీలు బి.తిరుమల, ఎం.దామోదర్, సీహెచ్ తారకేశ్వరావు, ఎం.మణి కంఠ, ఎం.దిలీప్ వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం సాంకేతిక కమిటీ చైర్మన్ కె.హరిబాబు, జిల్లా టెన్నీకాయిట్ సంఘం అధ్యక్షుడు మల్లా సంతోష్‌కుమార్, కార్యదర్శి ఎస్వీ జోగారావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం టి.చిట్టిబాబు, మల్లా భద్రయ్య పాల్గొన్నారు.

శ్రీధర్‌కు అభిమానుల శుభాకాంక్షలు


శ్రీధర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులు

పలాస, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, శిర్డీ సాయి బాబా సంస్థాన్ ట్రస్టు చైర్మన్ దువ్వాడ శ్రీధర్‌కు బుధవారం అభిమా నులు, వివిధ సంఘాల ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక శివాజీ నగర్‌లో ఆయన స్వగృహంలో వేడుకలు నిర్వ హించారు. అభిమానులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, రిటైర్డ్ ఆర్మీ జవాన్‌లు వచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ప్రజలంతా భోగ భాగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

పలాస, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో బుధవారం నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కొత్త సంవత్సరంలో వినూత్నంగా కార్యక్రమం చేయాలనే ఆలోచనతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు చైర్మన్ మల్లా రామేశ్వరరావు తెలిపారు. పలువురు రక్తదానం చేశారు. అలాగే విద్యార్థుల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో విద్యార్థులు పేదలు, యాచకులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, తాళాసు శ్రీను, నగేష్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

100 మంది మహిళలకు చీరల పంపిణీ

కాశీబుగ్గ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 8వవార్డు నర్సిపురంలో 100 మంది పేద మహిళలకు ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం చీరలు పంపిణీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక టీడీపీ నాయకులు ఆర్వీ రావు, అనంతరావు, చిరంజీవి, వెంకటేశ్వరరావు, ప్రకాష్ ఇచ్చిన చీరలను పేదలకు అందిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిం చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, సూర్యనారాయణ, చిన్ని, రాంబాబు, చంద్రశేఖర్ త్యాడి, ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వాభిమాన పోరాటాలకు స్ఫూర్తిగా నిలవాలి


భీమాకోరేగావ్ శౌర్య దివస్‌లో పాల్గొన్న సంఘ నేతలు

టెక్కలి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): భీమా కోరేగావ్ శౌర్య దివస్‌ను బుధవారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు మాట్లాడుతూ.. బహుజనులం దరూ స్వాభిమాన పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నాగేశ్వరరావు, మాధవరావు, లక్ష్మీనారాయణ, సీతారాం, సూర్యం, రాములు, పాపారావు, అప్పారావు పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ



నరసన్నపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రాంతాల్లో బుధవారం డాగ్‌స్క్వాడ్‌తో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఒడిశా నుంచి గంజాయి రవాణా జరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పార్సిల్ కేంద్రాల్లో తనిఖీ చేపట్టారు. అలాగే దాబాలు, పాన్‌షాప్‌లతో పాటు జమ్ము జంక్షన్ వద్ద అంతర్రాష్ట్ర జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఎస్‌ఐ దుర్గాప్రసాద్, ఏఎస్‌ఐ అసిరినాయుడు పాల్గొన్నారు.

పోలాకిలో..

పోలాకి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారనే సమాచారం రావడంతో బుధవారం పోలీసులు దుకాణాలను డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ రంజిత్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈతనిఖీలు నిర్వహించామని ఆయన పేర్కొన్నారు.

ఏఎంసీ చైర్మన్ల రిజర్వేషన్లకు కసరత్తు

(ఐదో పేజీ తరువాయి)

ఉన్నాయి. వీటిలో ఆరు మార్కెట్ కమిటీలు జనరల్ అభ్యర్థులకు కేటాయిస్తారు. జనరల్‌లో మూడు మహిళలకు కేటాయించనున్నారు. మిగతా ఆరు కమిటీల్లో మూడు బీసీలకు, రెండు ఎస్సీలకు, ఒకటి ఎస్టీకి కేటాయించే అవకాశం ఉంది. రిజర్వేషన్ ఉన్న ఆరు కమిటీల్లో మూడు మహిళలకు కేటాయిస్తారు. వీటిలో రెండు బీసీ మహిళలకు, మరొకటి ఎస్సీ లేదా ఎస్టీ మహిళకు కేటాయించే అవకాశం ఉంది. ఒక్కొక్క కమిటీలో 12 మంది రైతులు, ముగ్గురు ట్రేడర్స్‌ను తీసుకోనున్నారు. 12 మంది రైతుల్లో ఐదుగురు చిన్నకారు, ఐదుగురు పాడి రైతులతో పాటు భూమి ఎక్కువగా మరో ఇద్దరు రైతులను డైరెక్టర్లుగా తీసుకుంటారు. ఇప్పటికే మార్కెట్ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్లకు సంబంధించి జాబితాను తయారు చేయాలని ఎమ్మెల్యేలకు ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. దీంతో ఆశావహులు ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. నేడో, రేపో రిజరేషన్లు ఖరారు కానున్నాయి. సంక్రాంతి నాటికి మార్కెట్ చైర్మన్ల నియామకం పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మిల్లు నుంచి ధాన్యం తిప్పి పంపారు

- రోడ్డుపై ఆందోళనకు దిగిన రైతులు

పోలాకి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పిన్నింటిపేట ధాన్యం మిల్లు నుంచి తేమశాతం పరిశీలించిన తర్వాత కూడా ధాన్యం తీసుకోకుండా తిరిగి పంపారని ప్రియాగ్రహారం రైతులు బుధవారం ధాన్యం ట్రాక్టర్లతో ఆందోళనకు దిగారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా పంపినప్పటికీ ఎందుకు తిరిగి పంపారని రైతులుతహసీల్దార్ సురేష్‌కుమార్‌ను నిలదీశారు. నిబంధనల పేరుతో రైతులను మిల్లర్లు వేధిస్తున్నారని విమర్శించారు. ఈ ఘటన నేపథ్యంలో తహసీల్దార్ స్పందించి మిల్లు యజమానితో మాట్లాడి ధాన్యాన్ని కొనుగోలు చేయించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.


రహదారిపై ఆందోళన చేస్తున్న ప్రియాగ్రహారం రైతులు

ధాన్యం భద్రపరచుకునేందుకు పాట్లు

- వాతావరణంలో మార్పుతో రైతుల్లో ఆందోళన

జలుమూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం భద్రపరుచుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. బుధవారం వాతావరణంలో వచ్చిన మార్పులతో ఆకాశం మేఘా వృతమై వర్షం కురిసే అవకాశాలు కనిపించడంతో పంటలను రక్షించుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల వరుస వాయుగుండాలతో ఎడతెరిపిలేని వర్షాలు, గడచిన వారంలో పొలాల్లో నిలిచిన నీటిని తొలగించి పంటలను రోడ్డుపైకి తీసుకు వచ్చి నూర్పులు చేపట్టారు. ఇంతలో మరలా మబ్బులు వేయడంతో ఎండపోసిన ధాన్యాన్ని సంరక్షించుకునేందుకు చర్యలు తీసుకున్నారు.


తమ్మయ్యపేట వద్ద కళ్లాల్లో ఎండపోసిన ధాన్యాన్ని సంరక్షించుకుంటున్న రైతులు

పీఏసీఎస్ ఎన్నికలకు మరో ఆరు నెలలు ఆగాల్సిందే

(ఐదో పేజీ తరువాయి)

ద్రాక్షగా మారాయి. పీఏసీఎస్‌ల్లో 50 శాతం వాటాలు ప్రైవేటు వ్యక్తులకు అప్ప గిస్తూ జగన్ సర్కారు నిర్ణయం తీసుకుంది. దీనిపై రైతులతో పాటు పీఏసీఎస్ ఉద్యోగులు, సిబ్బంది నుంచి నిరసన వ్యక్తం కావడంతో వెనక్కి తగ్గింది. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో ప్రస్తుతం పీఏసీఎస్‌ల్లో రైతుల సభ్యత్వం తగ్గిపోయింది. సభ్యత్వ రుసుం రూ.10 నుంచి ఏకంగా రూ.300కు పెరిగింది. కార్యవర్గాల ఎన్నికలు పంచాయతీ ఎన్నికలకు మించి ఖర్చుగా మారాయి. ఫలితంగా అవినీతి కూడా పెరిగింది. తాజాగా, జి.సిగడాం పీఏసీఎస్‌లో భారీ అవినీతి బయటపడింది. వైసీపీ శ్రేణులకు రుణాలు, బినామీల పేరిట రాయితీలు అంది నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

గడువులోగా..

వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీలను రద్దుచేస్తూ కూటమి ప్రభుత్వం గతేడాది జూన్ 27న ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది. పీఏసీఎస్‌లకు ఆరు నెలల పాటు తాత్కాలికంగా పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. ఈలోగా ప్రభుత్వం ఎన్నికలకు వెళుతుందని అంతా భావించారు. కానీ అలా జరగలేదు. తాజాగా, మరో ఆరు నెలల పాటు పర్సన్ ఇన్‌చార్జిలను కొనసా గిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఆశావహులు నిరాశలో మునిగి పోయారు. ఎన్నికల కోసం మరో ఆరు నెలలు ఆగాల్సిందేనని నెట్టూరుస్తున్నారు. అయితే, వైసీపీ సర్కారు మాదిరిగా త్రీమెన్ కమిటీలను నియమించాలన్న ప్రతిపాదన ఉంది. ఇంతలోనే ఈ ఏడాది జూన్ లోగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభు త్వం భావిస్తున్నట్టు సమాచారం. ఇక నుంచి నిర్ణీత గడువులోగా ఎన్నికలు పూర్తిచేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. కాగా, డీసీసీబీతో పాటు డీసీఎంఎస్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా జాయింట్ కలెక్టర్ మరో ఆరు నెలలు కొనసాగనున్నారు.

ఎన్నికలకు కసరత్తు

వ్యవసాయ పరపతి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొన్ని సాంకేతిక కారణాలతో అది సాధ్యం కావడం లేదు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించి ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. మరోవైపు త్రీమెన్ కమిటీలను ప్రకటించే పరిస్థితి కనిపిస్తుంది.

-వి.నగేష్, డీసీవో, శ్రీకాకుళం

న్యూస్ బాక్స్

వరి చేలు దగ్ధం

పాతపట్నం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బడ్డుమర్రి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదం ఈ ప్రమాదంలో కుడుతూరు జోగారావు, జానకిరావులకు చెందిన వరి చేలు అగ్నికి ఆహుతయ్యాయి. కాగా ఈ ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

కోటబొమ్మాళి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా హరిశ్చంద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు కొత్తపేటకు చెందిన హ్యూమన్‌రైట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డీకే కృష్ణ మోహన్ నోటు పుస్తకాలు బుధవారం పంపిణీ చేశారు. వీటిని హెచ్‌ఎం నూక లక్ష్మణరావు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు..

నరసన్నపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరానగర్ కాలనీలో ఈశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 మంది పేదలకు బుధవారం దుప్పట్లను పంపిణీ చేశారు. పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సామాజిక ఆసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డా.నిక్కు పద్మావతి కోరారు. అలాగే అన్న ప్రసాదాన్ని అందించారు. కాన్యక్రమంలో మార్పు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

టెన్త్ మోడల్ పేపర్ ఆవిష్కరణ

జలుమూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ తయారు చేసిన టెన్త్ మోడల్ పేపర్‌ను ఎంఈవోలు బి.మాధవరావు, ఆర్వీఎస్. ప్రసాదరావు బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ మోడల్ పేపర్లతో విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎన్.పురుషోత్తం, అధ్యక్షుడు హర్షవర్ధన్, గౌరవాధ్యక్షుడు జి.రాము,తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం

వజ్రపుకొత్తూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణం కూటమి ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. డోకులపాడు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సముద్ర తీరం వరకు నిర్మించిన బీటీ రోడ్డును బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. 'పల్లెపండగ'లో భాగంగా ఉపాధి నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, నేతలు దున్న షణ్ముఖరావు, చింత నారాయణ, కర్ని రమణ, ఎంపీడీవో రమేష్ నాయుడు, డీఈ రవిబాబు, ఏఈ నాగ భూషణం తదితరులు పాల్గొన్నారు.